# 6

## ఏది స్వార్థం?

"స్నేహితుడు స్నేహితుడని భుజాలు రాసుకుంటూ తిరిగినందుకు ఇంత మోసం చేస్తాడా ఆ రాఘవ... అబ్బెబ్బే... ఈ రోజుల్లో నేను నాది అన్న స్వార్థం తప్ప మరొకటి ఉండకూడదు..." ఒళ్ళు మండిపోతోంది విశ్వానికి.

"ఇదిగోరా కాఫీ" టీపాయ్‌మీద కాఫీ గ్లాసు పెట్టింది విశాలాక్షి.

"అమ్మా!"

"ఏవిట్రా?" వెళ్ళబోతున్నావిడ వెనక్కి తిరిగింది.

"ఓ రెండొందలుంటే ఇస్తావా?..." ఓ రెండు రూపాయలిమ్మన్నంత తేలిగ్గా అడిగేశాడు... దిగాలు పడి చూసిందావిడ. నెలాఖరు రోజుల్లో చేతిలో రెండొందలా...? "లేవురా" ఆ మాట చెప్పడానికి చాలా నొచ్చుకుంది మనసు. తెల్సిన వాళ్ళింట్లో వంటపని చేసి ఇల్లు గడుపుకొస్తుంది. కొడుకుని కాలేజీలో చదివిస్తోంది. భర్త బతికున్నప్పుడు ఏదో కాస్తో కూస్తో బాగా బతికిన కుటుంబమే అయినా ఆయనగారు చేసిన అప్పులకి అన్నీ హరించుకుపోయాయి. పిల్లాడి చిన్నప్పుడే ఆయన పోవడంతో ఇంటి బాధ్యత నెత్తినేసుకుని కొడుకుని వృద్ధిలోకి తీసుకురావడమే తన ధ్యేయంగానూ... తప్పకుండా వాడి భవిష్యత్తు బాగుంటుందన్న ఆశతోనూ గడుపుతోంది. ఎటొచ్చీ విశ్వానికే... ఉడుకురక్తం కదా... ఊళ్ళో అందరూ హాయిగా ఉన్నారు... తన ఇంట్లోనేనా ఈ కష్టాలన్న విసుగు... చిరాకూ... దానికి తోడు రాఘవ తననేదో మోసం చేసేస్తున్నాడన్న కోపం. వాడు, తను, స్వరాజ్యం ఒకే కాలేజీలో చదువుతున్నారు. ఎల్లుండి తన పుట్టినరోజని వాడికి తనకి మాత్రమే చెప్పింది స్వరాజ్యం. ఏదో గిఫ్ట్

తప్పకుండా కొనిస్తాడు వాడు. మరి తనివ్వకపోతే వాడిముందు తీసికట్టు అయిపోదూ... అందుకే బాగా ఆలోచించి అడిగాడు "నువ్వు కొనే గిఫ్ట్ మనిద్దరం కలిసి ఇస్తున్నట్టు మనిద్దరి పేర్లూ రాసెయ్యరా దానిమీద" అని. అందుకు ఒప్పుకోలేదు రాఘవ. దాంతో స్నేహితుడి మీద పీకల్దాకా కోపం వచ్చింది. తనూ ఏదన్నా కొనివ్వాలన్న పంతం కూడా పెరిగింది. వీటికి తోడు అసహనం కలిగింది అమ్మ ఇచ్చిన సమాధానంతో.

ఖాళీగ్లాసు తీసికెళ్ళడానికొచ్చిన ఆవిడ మెళ్ళో గొలుసుమీద పడ్డాయి విశ్వం చూపులు. రెండొందలు కావాలని అడిగితే లేవని చెప్పేసి ఊరుకోవడం ఏమిటి? అయ్యో పాపం... కొడుకు తర్వాతే కదా ఈ నగా నట్రా అని అనుకోవద్దా? నిజమైన ప్రేమా శ్రద్ధా తనమీద ఉంటే ఆ గొలుసు తాకట్టు పెట్టడమో, అమ్మడమో చెయ్యచ్చు కదా? డబ్బు దగ్గర ప్రతివాళ్ళూ స్వార్థం చూపిస్తున్నారు...

వివేకం, విచక్షణ కోల్పోయిన విశ్వం మంచీ చెడు ఆలోచించే పరిస్థితిలో లేడు. నిజానికి స్వార్థంతో ఆలోచిస్తున్నది తనే అన్న సంగతి తెలుసుకోలేకపోతున్నాడు. ఆవేశపు పొరలు కమ్మడంవల్ల.

బియ్యం చేటలో పోసుకుని ముందు పెట్టుకుందేగానీ విశాలాక్షి మనసులో కొడుకు అడిగిన డబ్బు గురించే ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. తను వంటపని చేసే ఆ సావిత్రమ్మగారిని ఎప్పుడూ కూడా నెలమధ్యలో డబ్బు అడగలేదు తను. మొదటి తారీకు జీతం తీసుకుని ఇంటికి కావలసిన సరుకులు ఒకేసారి నెలకి సరిపడా అచితూచి కొనుక్కుని... కొడుకు చేతి ఖర్చుకి కొంత ఇచ్చేసి పొదుపుగా జాగ్రత్తగా గడుపుకోవడమే అలవాటు. అంతేకానీ దుబారా ఖర్చులు చేసి అప్పులకోసం వీధిన పడడం ఇష్టం వుండదు.

కానీ ఈ రోజు పిల్లాడి మొహం చూస్తుంటే మనసు మెలిపెట్టినట్టవుతోందావిడకి. తన పద్ధతికి విరుద్ధంగా వెళ్ళి వాడికోసం అభిమానం చంపుకుని సావిత్రమ్మగారిని అడిగి డబ్బు తీసుకొచ్చి ఇద్దామన్నా వాళ్ళెవరూ ఊళ్ళోలేరు. రెండుమూడు రోజులైంది వెళ్ళి. ఇంకో నాలుగు రోజులగ్గానీ రారు.

అన్యమనస్కంగానే పన్లన్నీ చేసుకుంది. భోజనం వేళకి పిలిచింది కొడుకుని. రాలేదు. కాసేపు చూసి వెళ్ళి కేకేసింది. "నేను రాను. నువ్వు తినేసెయ్యి. నన్ను విసిగించకు" చిరాకు పడిపోయాడు.

చివుక్కుమంది తల్లి ప్రాణం.

"నువ్వు తినకుండా నేనెప్పుడైనా తిన్నాన్రా?"

ఆ మాటకి గయ్యిమని లేచాడు "అంత నేనంటే ప్రాణమైతే... మెళ్ళో గొలుసు తీసి తాకట్టు పెట్టో... అమ్మకం చేసో డబ్బు ఇస్తానని అని ఉండేదానివి".

కట్టెలా బిగుసుకుపోయింది విశాలాక్షి.

ఒక్కగానొక్క కొడుకుమీద పంచప్రాణాలు పెట్టుకుని... వాడు తింటే చాలు తన కడుపు నిండుతుందన్నట్టుగా పెంచి పెద్దచేసి చదువు చెప్పిస్తూ... నిత్యం వాడి క్షేమం కోసం ఆ భగవంతుడిని ప్రార్థించే తను బతికి ఉన్నది... వాడినోటి నుంచి ఇలాంటి మాట వినడానికా?

కళ్ళల్లో నీళ్ళు కొడుకు కంటపడకూడదని మొహం పక్కకి తిప్పుకుంది.

"నేను తీసికెళ్ళి తాకట్టు పెట్టి డబ్బు తీసుకొస్తాను... ఇస్తావా గొలుసు?"

"ఇవ్వను" ఆవిడ గొంతు వణికింది ఆ మాట అంటుంటే.

అంత ఖచ్చితంగా తల్లి అలా అనడంతో కన్నకొడుక్కంటే బంగారం అంటేనే ఆవిడకెక్కువ ఇష్టం అన్న నిర్ధారణకి వచ్చేశాడు విశ్వం.

"నీ చదువులకి నాకున్న జత గాజులూ... మంగళసూత్రాలూ ఎప్పుడో అమ్మేశాను. అవసరాలకి ఇంట్లో వున్న కాస్తో కూస్తో ఇత్తడి సామాను కూడా వెళ్ళిపోయింది".

"అందుకని ఈ గొలుసు ఇవ్వకూడదని తీర్మానించుకున్నావా? నేను ఉద్యోగంలో స్థిరపడిన తర్వాత ఇలాంటి గొలుసొకటి చేయించి పడేస్తాలే నీకు" నీ మొహాన పడేస్తాలే అన్నట్టుగా అనిపించింది ఆవిడకి ఆ మాట. అయినా భరించి మౌనాన్ని ఆశ్రయించింది.

"ఇస్తావా? ఇవ్వవా? నాకు అవమానం జరగడం నీకు ఇష్టమా?"

"నీకు అవమానం జరగడం ఇష్టంలేకే ఇవ్వనంటున్నాను.. ఇది... ఇదీ.. బంగారం కాదు. ఇత్తడి మీద పసుపురంగు పాలిష్ పెట్టిన గొలుసు..." చివరి మాట

అంటూనే దుఃఖం ఆపుకోలేక కొంగు అడ్డం పెట్టుకుని నిలబడ్డ చోటే కూలబడి పోయింది విశాలాక్షి.

విశ్వం మొహం వెల వెల పోయింది.

నిజమైన స్వార్థపరుడివి నువ్వే అంటూ తన మనసు తననే నిలదీసినట్టనిపించి సిగ్గుతో తలదించుకున్నాడు.

*మల్లెతీగ మాసపత్రిక, మార్చి 2009*